ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY





విద్యార్థులకు భోజనం అందిస్తున్న ప్రజాప్రతినిధులు(ఫైల్)

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం?

ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయడం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. దూర ప్రాంతాల నుంచి కళాశాలకు వచ్చే విద్యార్థులు ఉదయమే ఖాళీ కడుపులతో వస్తూ మధ్యాహ్నం వరకే నీరసిస్తున్నారు. చదువుపై ఏకాగ్రత నిలవక ఆకలితో ఇంటిబాట పడుతున్నారు. మధ్యాహ్న భోజనం అమలైతే విద్యార్థుల హాజరుశాతం పెరిగి మెరుగైన ఫలితాలు వస్తాయని ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

వాంకిడి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వజూనియర్ కళాశాలల్లో మధ్యాహ్నభోజన పథకాన్ని అమలుచేయాలని ప్రభుత్వ యోచిస్తోంది. జిల్లాలో మొత్తం 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. ఇందులో 5వేలకు పేగా విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రభుత్వ కళాశాల నుంచి మండలాల్లోని ప్రలుగ్రామాలు దాదాపు 12నుంచి 15కిలో మీటర్లు దూరంఉన్నాయి. పరిసర గ్రామాల నుంచి సరైనరవాణా సదుపాయాలు లేక విద్యార్థులు సకాలంలో తరగతులకు హాజరు కావడంలేదు. పైగాఇంటినుంచి బయల్దేరే సమయానికి భోజనం తయారు కాకపోవడం, బస్సులు అందవన్న కారణంగా చాలామంది విద్యార్థులు ఖాళీ కడుపుతోనే కళాశాలకు వస్తున్నారు. ఉదయం కళాశాలకు వచ్చిన అనేకమంది విద్యార్థులు మధ్యాహ్నం ఆకలికి తట్టుకోలేక ఇళ్లకు వెళ్తున్నట్లు అధ్యాపకులు చెబుతున్నారు. పరీక్షలు సమీపిస్తున్న వేళ ఆకలికి తట్టుకోలేక మధ్యాహ్నం నుంచే ఇంటిముఖం పడుతున్నారు. ఈసమస్యను అధిగమించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉన్నతవిద్యాశాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసేపనిలో పడింది. వచ్చేవిద్యాసంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనపథకం అమలుకు శ్రీకారం చూపుతారని అధికారులు పేర్కొంటున్నారు.

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అమలుకు సర్కారు యోచన
- హాజరు శాతం పెరిగేందుకు అవకాశం
- విద్యార్థుల ఆకలి బాధలకు సెలవు..

● హాజరుశాతం పెరిగేందుకు వీలు..

మధ్యాహ్నభోజన పథకం అమలుతో ప్రధానంగా డ్రాపౌట్లు తగ్గిపోయి హాజరు శాతం పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. మధ్యాహ్నం భోజనం చేయకపోవడంతో నీరసంగా ఉంటూ తరగతుల్లో అధ్యాపకుల బోధనలు అర్థంకావడం లేదనివిద్యార్థులు ఆవేదనచెందుతున్నారు. దీంతో పాటు ఇంటర్ ఉత్తీర్ణతశాతం కూడా తగ్గడానికి కారణం అవుతుందని అధికారులు చెబుతున్నారు. మధ్యాహ్నభోజనం అమలై క్రమం తప్పకుండా విద్యార్థులు హాజరైతే ఇలాంటి సమస్య ఉండదని భావిస్తున్నారు.

● గతంలో ఇలా చేశారు..

పడిపపోతున్న విద్యాప్రమాణాలను గుర్తించిన అధ్యాపకులు ఐదేళ్ల క్రితం స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో వార్షిక పరీక్షలకు ముందు 2నెలల పాటు మధ్యాహ్న భోజనపథకాన్ని ప్రారంభించారు. దీంతో విద్యార్థుల హాజరుశాతంతో పాటు ఉత్తీర్ణత శాతం కూడా పెరిగింది. అప్పట్లో ఇదిమంచి ఫలితాలను ఇచ్చినా మరుసటి ఏడాది నుంచి ఎవరూ ముందుకు రాకపోవడంతో మధ్యాహ్న భోజనం నిలిచిపోయింది. దీంతో విద్యార్థుల హాజరు తగ్గి ఉత్తీర్ణత శాతంపై ప్రభావం చూపింది.

ఫలితాలు మెరుగుపడతాయి..



\- దుర్గం రిషిత్- విద్యార్థి

ఆకలి సమస్యతో ఏకాగ్రత దెబ్బతింటోంది. దీంతో మధ్యాహ్నామే ఎక్కువమంది ఇంటి బాట పడుతున్నారు. ప్రభత్వ పాఠశాలల్లో మాదిరిగానే ప్రభుత్వ కళాశాలల్లోనూ భోజనపథకం అమలు చేస్తే కచ్చితంగా ఫలితాలు మరింత మెరుగుపడతాయి.

విద్యార్థులకు మేలు జరుగుతుంది..



\- చంద్రయ్య, ప్రిన్సిపాల్

ప్రభుత్వ కళాశాలల్లో మధాహ్న భోజన పథకం అమలు చేయడం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుంది. వివిధ నరిసర ప్రాంతాల నుంచి విద్యార్థులు ఉదయమే ఖాళీ కడుపులతో వస్తూ మధ్యాహ్నం ఆకలితో ఇంటిబాట పడుతున్నారు. అనేకమంది విద్యార్థులు నీరసంగా ఉంటున్నారు. మధ్యాహ్న భోజనం అమలైతే విద్యార్థుల హాజరుశాతం పెరిగి మెరుగైన ఫలితాలు వస్తాయి.

మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిగా అదనపు కలెక్టర్



అదనపు కలెక్టర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్ అంజయ్య

కాగజ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మున్సిపాల్టీ ప్రత్యేక అధికారిగా అదనపు కలెక్టర్ దీపక్ తివారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మున్సిపాల్టీలో నెలకొన్న పలు సమస్యలపై మున్సిపల్ కమిషనర్ అంజయ్యతో కాసేపు చర్చించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాగజ్‌నగర్ పట్టణ అభివృద్ధికి, పారిశుధ్య పనుల నిర్వహణకు చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అంజయ్య అదనపు కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.

కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కందుల కోనుగోలును ప్రారంభిస్తున్న చైర్మన్లు, అధికారులు

జైనూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల మార్కెట్ గోదాంలో సోమవారం కందుల కోనుగోలు కేంద్రాన్ని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్, సహకార చైర్మన్ కొడప హన్నుపటేల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సహకారచైర్మన్ కొడప హన్నుపటేల్ మాట్లాడుతూ ఈసారి కందిసాగు చేసిన రైతులు వ్యాపారులకు విక్రయించకుండా ప్రభుత్వ గిట్టుబాటు ధరకు సహకార కేంద్రం ద్వారా కోనుగోలు చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని కోరారు. క్వింటాలు కందికి 7,550రూపాయల ధర చెల్లిస్తున్నామన్నారు. కందులు విక్రయించే రైతులు తమ పేర్లు ఆన్‌లైన్‌లో నమోద్దై ఉండాలన్నారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, డీసీవో రాథోడ్ బిక్కు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మందాడి లింగు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీపై అపోహలు వద్దు: డీఎం



కార్మికులతో మాట్లాడుతున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీపై అపోహలు పడవద్దని డీఎం విశ్వనాథ్ అన్నారు. ప్రమాదరహిత మాసోత్సవాల సందర్భంగా సోమవారం ఆసిఫాబాద్ డిపోఆవరణలో ఉద్యోగులు, కార్మికులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. ఎలక్ట్రికల్ బస్సులవల్ల డిపోలను ప్రైవేటుపరం చేస్తున్నారని జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదన్నారు. కార్యక్రమంలో మెకానికల్ ఫోర్‌మెన్ ఉదయ్, టీఐ భారతి తదితరులు పాల్గొన్నారు.

విధులు బహిష్కరించి.. నిరసన

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ డిపో డీఎం విశ్వనాథ్ వేధింపులు భరించలేక సోమవారం ఉదయం ఆర్టీసీ కార్మికులు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తం చేశారు. డీఎంపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ నాయకులు దివాకర్ డిమాండ్ చేశారు. విషయం తెలుసున్న డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్ రావు డిపోకు చేరుకుని డీఎంతో మాట్లాడారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నాయకులు బాలేష్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

2న బీసీ రాజకీయ యుద్ధ భేరి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): హనుమకొండలో ఫిబ్రవరి 2న నిర్వహించే బీసీల భారీ బహిరంగ సభ(బీసీ రాజకీయ యుద్ధ భేరి)ను విజయవంతం చేయాలని తీన్మార్ మల్లన్న కమిటీ జిల్లా అధ్యక్షుడు నగేష్ కోరారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా నిర్వహించే బహిరంగ సభకు బీసీలందరూ కదిలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జాన్‌పాల్, నరేష్, శ్రీనివాస్, తిరుపతి తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలి

ఆసిఫాబాద్‌రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఆటలు, వినోదంతో కూడిన నాణ్యమైన బోధన అందించాలని అకడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్ అన్నారు. సోమవారం జిల్లాలోని 15కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు గణితం, సైన్స్ క్యూరియాసిటీ బోధనపరికాలు అందజేశారు. కార్యక్రమంలో బుక్‌డిపో మేనేజర్ ప్రకాష్, ఆర్పీలు శంకర్, రాజకమలార్‌రెడ్డి, రగయ్య, రవిచంద్రరెడ్డి, భరత్‌రావు, రవికుమార్, రహిం అహ్మద్, శ్రీనాథ్, రాజనర్స్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

7న 'లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు'

ఆసిఫాబాద్/రెబ్బెన, జనవరి 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహించే లక్ష డబ్బులు, వెయ్యి గొంతుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పట్టణంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవరావు, రెబ్బెనలో జంగంపల్లి రాజేష్ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలో ప్రధానవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ ఎస్సీల వర్గీకరణ లక్ష్యంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఆసిఫాబాద్‌లో కార్యక్రమంలో నాయకులు మహేష్, అశోక్, రాజు, యశోద, సురేష్, నరేష్, నాగరాజు, శ్రీకాంత్, సాయి, శంకర్, ఆర్ శంకర్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.



ఆసిఫాబాద్: కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే



గోడవెల్లి పాఠశాలలోని బియ్యాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై ప్రజవాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరష్కారానికి అధికారుల సమన్వయంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణం జన్కాపూర్ చెందిన గంగామణి తనకు మెడికల్ కాలేజీలో ఉపాధి కల్పించాలని అర్జీ సమర్పించారు. కౌటాల మండలం ముత్తంపేటకు చెందిన దరణి తమ కుటుంబం గుడిసెలో నివసిస్తోందని ఇందిరమ్మ ఇల్లు ఇప్పించాలని దరఖాస్తు చేసుకుంది. రెబ్బెన మండలం దేవులగూడకు చెందిన సౌమ్యపల్లివి తాను సికిల్‌సెల్ వ్యాధితో బాధపడుతున్నానని చికిత్సకోసం ఆర్థికసాయం అందజేయాలని, ఆసిఫాబాద్ పట్టణం హడ్కో కాలనీకి చెందిన భాగ్యలక్ష్మి ఇంటిస్థలం, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. అడ గ్రామానికి చెందిన సమ్మెక్క అధ్యక్షురాలు అంకాలి మూత్రశాలల బిల్లులు ఇప్పించాలని దరఖాస్తు చేసుకుంది. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాలి..

జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి కృషి చేయాని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో తెలంగాణ అగ్రి డాక్టర్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావుతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయరంగ అభివృద్ధికోసం అధికారులు సమన్వయంతో కృషిచేసి రాష్ట్రంలోనే మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలోఏడీఏ మిలింద్ కుమార్, ఏవోలు మంజుల, విజయ్‌కుమార్, దీప్తి, దిలీప్,వినయ్, యుగందర్, గిరీష్, హేమలత, కార్తీషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి..

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమవసతిగృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమారం జిల్లాకేంద్రంలోని గోడవెల్లి ఎంజీపీఎస్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదులు, వంటశాల, సరుకుల నిలువ, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంతోపాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలన్నారు. వంట సమయంలో తాజాకూరగాయలు, నాణ్యమైన నిత్యావసర సరుకులు వినియోగించాలన్నారు. పది, ఇంటర్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రత్యేకదృష్టి సారించాలని, ప్రణాళికబద్దంగా సిలబస్ పూర్తి చేయాలని తెలిపారు.

గంగాపూర్ జాతరను ఘనంగా నిర్వహించాలి..

జిల్లాలోని రెబ్బెన మండలం గంగాపూర్ శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో వచ్చేనెల 11నుంచి 13వరకు జరిగే వేడుకలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జాతరకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖాధికారులు, నాయకులు, కమిటీసభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉత్సవాలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలన్నారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీఎమ్మెల్యే ఆత్రంసక్కు, బాలేష్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆలయ కమిటీసభ్యులు డీసీసీఅధ్యక్షుడు విశ్వప్రసాద్ రావును ఆయననివాసానికి వెళ్లి జాతర ఆహ్వానపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయ కులు బాలేష్‌గౌడ్, జయరాం, రమేష్, సుదర్శణ్, గంటుమేర, వి మలేష్, మురళీ, దేవాజీ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన



షీటీం అవగాహన సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

కాగజ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ మండలం చింతగూడ జడ్పీ హైస్కూల్‌లో సోమవారం షీటీంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో షీ టీం సభ్యులు సునీత, శ్రీనివాస్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై అంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే మహిళలపై ఎలాంటి వేధింపులు జరిగిన వెంటనే 100కుడయల్ చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు, సిబ్బంది, షీటీం సభ్యులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వాసవీమాతకు సారె

చింతలమానేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో సోమవారం వాసవీ మాతకు మనసారె కార్యక్రమం ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా శివపంచాయతన ఆలయ అర్చకుడు సహకారంతో అమ్మవారికి సారే సమర్పించారు. అనంతరం ప్రత్యేకపూజలు, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకుల మొండయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

● తహసీల్దార్లకు వినతిపత్రాలు సమర్పించిన పీఆర్టీయూటీఎస్ సభ్యులు



కాగజ్‌నగర్‌లో వినతి పత్రం అందిస్తున్న పీఆర్టీయూటీఎస్ ప్రతినిధులు

కాగజ్‌నగర్ టౌన్, జనవరి 27: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ కాగజ్‌నగర్ తహసీల్దార్‌కు సోమవారం పీఆర్టీయూటీఎస్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. 2004నుంచి ప్రవేశపెట్టిన కాంట్రిబ్యూటరి పెన్షన్‌స్కీం స్థానంలో యునైటెడ్ పెన్షన్‌స్కీంను కేంద్రప్రభుత్వం ప్రవేశ పెట్టడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు పదవీ విరమణ అనంతరం పూర్తి పెన్షన్ పొందే అవకాశాన్ని కోల్పోయామని పీఆర్టీటీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు ఏటుకూరి శ్రీనివాస్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్, యుపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని తహసీల్దార్‌కు పీఆర్టీయూటీఎస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించామన్నారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీమేరకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు ఎనగంటి బిక్షపతి, జాడి దేవాజీ, బాలునాయక్, ముంజంపల్లి రమేష్, ధనలక్ష్మి, చంద్రశేఖర్, తరన్ గైన్, మంగతాయారు,ఇందూర్‌కార్ వికాస్, డోకె దామోదర్, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

వాంకిడి/కౌటాల/ పెంచికలపేట: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానంను అమలు చేయాలని కోరుతూ సోమవారం వాంకిడి, కౌటాల, పెంచికలపేట తహసీల్దార్లకు పీఆర్టీయూటీఎస్ నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్ర మంలో ఆ సంఘం నాయకులు వినేష్, గిర్మాజీ, శ్వేత, ప్రియాంక, కౌటాలలో ఆసంఘం నాయకులు నర్సింహాచారి, రాజు, గణపతి, రమేష్, రాంచందర్, విజయ్‌సింగ్, విఠల్,శివాజీ,పెంచికలపేటలో ఉపాధ్యాయులు విజయనిర్మల, తదితరులు పాల్గొన్నారు.



వాంకిడి తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూటీఎస్ ఉపాధ్యాయులు

ఎస్పీఎంలో ఎన్నికలు నిర్వహించాలి



డీసీఎల్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కాగజ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఎస్పీఎంలో ట్రేడ్‌యూనియన్ ఎన్నికలు నిర్వహించాలని ఆదిలాబాద్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్(డీసీఎల్)కు సోమవారం సిర్పూరు పేపర్ మిల్స్ ఎంప్లాయిస్(2735) సంఘం నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎస్పీఎం ట్రేడ్ యూనియన్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలన్నారు. మిల్లు పునరుద్దరణ జరిగినతర్వాత ఇంతవరకు ఎన్నికలు నిర్వహించలేదన్నారు. గతంలో కూడా తాము లేబర్ అధికారుకు వినతిపత్రాలను ఇచ్చామన్నారు. అయినా కూడా ఇంతవరకు స్పందించటం లేదన్నారు. ఇప్పటికైనా ఎస్పీఎంలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాములు, గోలేం వెంకటేష్, పిరిసింగుల శ్రీనివాస్,రాజేష్‌యాదవ్,శ్యాంరావు, లింగంపల్లి శ్రీనివాస్, జాడిఅశోక్‌పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్స్ డే



కేక్ కట్ చేస్తున్న ఎలక్ట్రీషియన్‌లు

ఆసిఫాబాద్ రూరల్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఎలక్ట్రీషియన్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రైవేటు ఎలక్ట్రీషియన్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎలక్ట్రికల్ ప్రితామహుడు సర్ థామస్ అల్వా ఎడిసన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మహ్మద్ మోయినోద్దీన్, గంగన్న, సురేష్‌సాయి, అంకుస్, సంతోష్,మహేష్‌పవన్ పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నీ విజేత పెంచికలపేట

వాంకిడి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని వాంకిడి మండలం సవ్వాతి గ్రామంలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ టోర్నమెంట్‌లో పెంచికలపేట జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు గ్రామ పటేల్, మాజీ సర్పంచ్ భీంరావు, కార్యదర్శి రాజేందర్ తదితరులు బహుమతులు అందజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిర్పూర్(టి), జనవరి 27(ఆంధ్రజ్యోతి): గురుకులాల్లో ప్రవేశాలకు నిర్వహించే కామన్‌పరీక్షలకు ఫిబ్రవరి1వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లాసమన్వయ అధికారి శ్రీనివాసరావు కోరారు. అలాగే 6నుంచి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పనికల్పిస్తాం

శ్రావణ్, ఏపీవో, ఈజీఎస్



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి : జాబ్‌కార్డు కలిగిన కూలీలకు పనులు కల్పిస్తున్నారా?

ఏపీవో : జాబ్‌కార్డులు కలిగిన కూలీ లకు ఉపాధిహామీ పథకంలో పనులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి ?

ఏపీవో : మండలంలో 9958 జాబ్ కార్డులు ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి : ఉపాధిహామీ పథకంలో ఎలాంటి పనులు చేపడుతున్నారు.?

ఏపీవో : ఉపాధిహామీ పథకంలో ఇంకుడు గుంతలు, ఫారం పాండ్లు, పశువుల షెడ్లు, వర్మీకంపోస్టు, అజోలగడ్డి పెంచడం, మొక్కల పెంపకం, బీడు భూములను అభివృద్ధిచేసే పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

ఆంధ్రజ్యోతి : చేన్లలో పొలం బాట పనులుచేపడుతున్నారా?

ఏపీవో : చేన్లలో పొలంబాటలు వేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. రైతులు సహకరిస్తే పొలం బాట పనులు ప్రారంభిస్తాం.

ఆంధ్రజ్యోతి : పని ప్రదేశంలో వసతులు కల్పిస్తున్నారా?

ఏపీవో : పనిప్రదేశంలో కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్నివిధాల వసతులు కల్పిస్తున్నాం.

- కెరమెరి, (ఆంధ్రజ్యోతి)

జోరుగా యాసంగి వరి నాట్లు

"రెబ్బెన మండలంలో యాసంగి నాట్లు జోరందుకున్నాయి. పుష్కలంగా నీటి లభ్యతతో రైతులు ఈ యాసంగి వరివేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. కూలీల కొరత కూడా లేకపోవడంతో మండలంలో ఎటూ చూసిన పొలం పనుల్లో రైతులు, కూలీలు తీరిక లేకుండా కనిపిస్తున్నారు."

● రెబ్బెన మండలంలో 2500 ఎకరాల్లో వరి సాగు ● కూలీలకు చేతి నిండా పని



నంబాలలో వరి నాట్లు వేస్తున్న మహిళలు

రెబ్బెన, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో యాసంగి వరినాట్లు జోరుగా సాగుతున్నాయి. మండలంలో వట్టివాగు ప్రాజెక్టు కాల్వల నీటితోపాటు గంగాపూర్ వాగు నీరు, బోర్లు అందుబాటులో ఉండటంతో రైతులు ఈ యాసంగిలో సైతం వరిసాగు చేస్తున్నారు. ముఖ్యంగా మండలంలోని రెబ్బెన, నంబాల, నారాయణపూర్, పుంజుమేరగూడ, కొమురవెల్లి, కైరిగాం, కొండపల్లి, రాజారం, ఎడవెల్లి, దేవులగూడ, నక్కలగూడ తదితర గ్రామాల్లో వరిసాగును చేస్తున్నారు. ప్రస్తుతం కూలీలకు ఎలాంటి ఇబ్బంది లేదు. కూలీలు ఎకరానికి రూ.5వేల వరకు గుత్తగా మాట్లాడుకొని వరినాట్లు వేస్తున్నారు. కూలీలు గ్రూపులుగా ఏర్పడి రోజుకు సుమారు నాలుగు, ఐదు ఎకరాల్లో వరినాట్లు వేస్తున్నారు. పదిహేను రోజులుగా కూలీలంతా కూడా పత్తి ఏరారు. రెబ్బెన మండలంలో పత్తి ఏరివేత కార్యక్రమం పూర్తి అయింది. గతంలో పత్తి ఏరివేత తర్వాత ఈ ప్రాంతంలో కూలిపని లభించకుంటే ఖమ్మం, ఇల్లందు ప్రాంతాలకు మిరప ఏరేందుకు వెళ్లేవారు. కానీ యాసంగి పంట ఊపందుకోవటం, వరినాట్ల ప్రక్రియ ప్రారంభం కావటంతో కూలీలకు ఉపాధి దొరకుతుండటంతో అంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. రెబ్బెన మండలంలో 2500ఎకరాల్లో యాసంగి సాగును రైతులు చేస్తున్నారు. వీరి సాగు విధానంపై కూడా ఎప్పటికప్పుడు వ్యవసాయాధికారులు రైతులకు వివిధ రకాల సూచనలిస్తున్నారు.

వ్యవసాయ పనులతో ఉపాధి..



పది రోజులుగా మండలంలో వరినాట్లు కొనసాగుతున్నాయి. దీంతో ట్రాక్టర్లకు పని లభిస్తోంది. రోజుకు ఐదునుంచి ఏడు ఎకరాల వరకు పొలాన్ని దున్నుతూ ఉపాధి పొందుతున్నాను. పని పుష్కలంగా దొరుకుతోంది.

-భీమేష్, ట్రాక్టర్ డ్రైవర్, ఇందిరానగర్

ఆధ్యాత్మిక మార్గంలో నడవాలి

సిర్పూర్(యు), జనవరి 27(ఆంధ్రజ్యోతి): సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని వినాయక్‌రావు మహరాజ్ అన్నారు. మండలంలోని మహగాంలో ఏడు రోజులుగా అఖండ హరినామ సప్తాహ నిర్వహించగా సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించడంతోపాటు కాళ మహాప్రసాదం వితరణ ఏర్పాటు చేశారు. అంతకుముందు వినాయక్‌రావు మహరాజ్, ఆత్రం భీంరావు స్వామి, తదితరులు ప్రవచనాలు వినిపించారు.

కార్యక్రమంలో మహగాం గురుదేవ్ సేవాశ్రమ్ పీఠాధిపతి కైలాస్ మహరాజ్, జైనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



భక్తి గీతాలు ఆలపిస్తున్న వినాయక్‌రావు మహరాజ్

వాలీబాల్, కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్సీ



వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

చింతలమానేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో సోమవారం ఎమ్మెల్సీ దండె విఠల్ కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్‌ను ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు క్రీడల్లో రాణించాలని, స్నేహభావంతో క్రీడలు ఆడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గణపతి, నానయ్య, హర్షద్ హుస్సేన్, శ్రీవర్ధన్, నహీర్ అలీ, మహేష్,తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ ప్రజల ఆత్మగౌరవాన్ని అవమానపరిచినట్టే

● ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జాతీయ జెండా ఎగురవేయకపోవటంపై బీఆర్‌ఎస్ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

కాగజ్‌నగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సందర్భంగా సిర్పూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం జాతీయ జెండా ఆవిష్కరించకపోవటం దారుణమని బీఆర్‌ఎస్‌పార్టీ నాయకులు అన్నారు. సోమవారం స్థానికంగా వారు మాట్లాడారు. రాజ్యాంగం ద్వారా ఎన్నికైన ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజల ఆత్మగౌరవాన్ని, రాజ్యాంగాన్ని అవమానపరిచినట్టేనని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ ఎస్ నాయకులు రాం ప్రసాద్, మండలకన్వీనర్ ఆవుల రాజ్ కుమార్, మాజీకౌన్సిలర్ నక్క మనోహర్, మండల కోకన్వీనర్ పార్వతి అంజన్న, ట్రేడ్ యూనియన్ నాయకులు రాగులయ్య, శోభన్, నజీం, ఆర్‌ఎస్‌పీ ఆఫీస్ ఇన్‌చార్జి దాసరి నరేందర్ తదితరులున్నారు.

సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు..

కాగజ్‌నగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాతీయ జెండా ఎగుర వేయలేదని వెంటనే ఈ విషయంలో ఎమ్మెల్యేపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం స్థానిక నాయకులు సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు వనమాల రాము, మహబూబ్‌ఖాన్ తదితరులున్నారు.

జెండా ఆవిష్కరణపై రాద్ధాంతం సరికాదు..

కాగజ్‌నగర్: ఎమ్మెల్యే హరీష్‌బాబు క్యాంపు కార్యాలయంలో జెండా ఆవిష్కరించలేదని దీన్ని రాద్ధాంతం చేయటం సరికాదని క్యాంపు కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిర్పూరు ఎమ్మెల్యే ఢిల్లీ టూర్ నుంచి నేరుగా ఈ నెల 26కు హైదరాబాద్‌కు చేరుకున్నట్టు, అనివార్య పరిస్థితి ఉండటంతో నేరుగా అసెంబ్లీస్పీకర్ వద్ద జరిగిన శాసన సభ జెండా వందన కార్యక్రమానికి హాజరైనట్టు పేర్కొన్నారు. దీన్ని రాద్ధాంతం చేయ టం సరికాదన్నారు.



కోల్ ఇండియా పోటీలకు క్రీడాకారుల ఎంపిక



సురేష్



సదయ్య



నరేందర్



తిరుపతి



రాజేశ్

శ్రీరాంపూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఈనెల 28నుంచి వచ్చేనెల 1వరకు మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలి పట్టణంలో నిర్వహించే ఆల్ ఇండియా కోల్‌ఫీల్డ్ హాకీపోటీలకు శ్రీరాంపూర్‌కు చెందిన ఐదుగురు సింగరేణి క్రీడాకారులు ఎంపికయ్యారు. గతేడాది డిసెంబర్20,21తేదీల్లో మణుగూరులో జరిగిన సింగరేణిస్థాయి హాకీ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వీరిని కోల్ ఇండియా పోటీలకు ఎంపిక చేశారు. ఎస్ఆర్పీ ఓసీపీకి చెందిన ఈపీఆపరేటర్ తోట సురేష్, ఎస్‌అండ్‌పీసీ విభాగంలో సెక్యూరిటీగార్డుగా పనిచేసే ఎద్దు సదయ్య, ఎస్ఆర్పీ ఓసీపీకి చెందిన జనరల్ మజ్దూర్ బెల్లం తిరుపతి, ఆర్కే7 గనికి చెందిన కోల్ కట్టర్లు జి నరేందర్, ఎల్ రాజేశ్ ఎంపికైన వారిలో ఉన్నారు

ఏనుగు రవీందర్ రెడ్డిని సన్మానించిన కార్మికులు

శ్రీరాంపూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): సింగరేణికోల్‌మైన్స్ లేబర్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ప్రధానకార్యదర్శిగా నియమితులైన ఏనుగు రవీందర్‌రెడ్డిని లోడింగ్, అన్‌లోడింగ్, టార్పాలిన్ హమాలీ కార్మికులు సోమవారం ఘనంగా సన్మానించారు. ఆయన కార్మికులకు ఎన్నో సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాజేష్, బీరయ్య,మల్లయ్య,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఏఐటీయూసీ

శ్రీరాంపూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఓసీపీలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా పేర్కొన్నారు. సోమవారం వారు ఓసీపీని సందర్శించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. ఓసీపీని, సీహెచ్‌పీసెక్షన్‌ను వేరుచేయాలని, టెక్నీషియన్లు, సూపర్‌వైజర్ల కొరత తీర్చాలని, ఉద్యోగులకు సరిపడా షెడ్లు నిర్మించాలని మేనేజర్ బ్రహ్మాజీని కోరారు. పరిష్కారానికి ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయకార్యదర్శి మోత్కూరి కొముయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, తదితరులు పాల్గొన్నారు.

ఓబీ మట్టి వాహనాలను అడ్డుకున్న గ్రామస్థులు



వాహనాలకు అడ్డంగా నిల్చుని నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

జైపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఓబీ మట్టిని సరఫరా చేస్తున్న వాహనాలను సోమవారం రామారావుపేట గ్రామస్థులు అడ్డుకున్నారు. తమ గ్రామం నుంచి గోదావరినదికి వెళ్లే రోడ్డును ఆదివారం రాత్రి మూసివేయడంతో వాహనాలకు అడ్డంగా కూర్చుని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రామారావుపేట గ్రామస్థులు పొలాలు, చేన్లకు, గోదావరి నదికి వెళ్లే దారిని మూయవద్దని సింగరేణి జీఎంకు, ఇందారం ఓపెన్‌కాస్టు ప్రాజెక్టు ఆఫీసర్‌కు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. దారిని మూసివేయవద్దని హామీఇచ్చినా ప్రాజెక్టుఅధికారి రాత్రికి రాత్రే దొంగతనంగా, నిరంకుశంగా పాత రోడ్డుపై మట్టిపోయించి మూసివేశారన్నారు. ఇప్పటికే ఓసీపీల్లో బాంబుబ్లాస్టింగ్ వల్ల ఇండ్లగోడలు బీటలు వారుతున్నాయని, ఓసీపీనుంచి వచ్చే దుమ్ముతో ప్రజలు అనారోగ్యాలబారిన పడుతున్నారన్నారు. సింగరేణితో గ్రామంమొత్తం నాశనం అవుతోందని, అయినా ఓర్చుకుని బతుకుతున్నామన్నారు. అయినా సింగరేణి అధికారులు రైతులను, ప్రజలను ఇబ్బందులు పెట్టేలా దారిని మూసేయడం ఎంతవరకు సమంజసమన్నారు. మూసివేసిన రోడ్డును వెంటనే తెరవాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. విషయం తెలుసుకున్న శ్రీరాంపూర్ ఇన్‌చార్జీ సీఐ రవీందర్, జైపూర్ ఎస్ఐ శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మాజీఎంపీటీసీ పెద్దలబాపు, రైతులు నామాల నాగరాజు, మునీందర్, రాజన్న, వెంకటేష్, అగ్గు రవీందర్‌పాల్గొన్నారు.

సింగరేణి రోడ్డును వినియోగించుకోండి: డీజీఎం(పర్సనల్)

మండలంలోని రామారావుపేట గ్రామస్థులు తమ పంట పొలాలకు వెళ్లేందుకు ఉన్న దారికి బదులుగా సింగరేణి నిర్మించిన రోడ్డును వినియోగించుకోవాలని డీజీఎం (పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉన్న రోడ్డు ఇందారం ఓసీపీ రెండు డంప్ యార్డులకు నడుమ ఉండడంతో ఓబీ మట్టిని అదే దారిలో వాహనాల ద్వారా తరలిస్తున్నట్లు పేర్కొన్నారు. గ్రామస్థులకు ఇబ్బంది కలుగకూడదనే ఉద్దేశంతో సింగరేణి పంట పొలాలకు, గోదావరి నదికి వెళ్లేందుకు ప్రత్యేకంగా రోడ్డు వేసిందని, ఆ రోడ్డును వినియోగించుకోవాలని ఆయన కోరారు.

టీబీజీకేఎస్‌తోనే ఉద్యోగులకు హక్కులు

శ్రీరాంపూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో సింగరేణి ఉద్యోగులకు పలు హక్కులు సాధించినట్లు ఆ యూనియన్ రాష్ట్రకార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. యూనియన్ 23వ ఆవిర్భావవేడుకలను సోమవారం యూనియన్‌కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కేంద్ర కమిటీ సభ్యుడు ఎండీ లాల, పాల్గొన్నారు.

మందమర్రి టౌన్: మందమర్రి ఏరియాలోని అన్నిగనుల, డిపార్టుమెంట్ల వద్ద టీబీజీకేఎస్ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కేంద్రకమిటీ, ఏరియాకమిటీ నాయకులు మేడిపెల్లి సంపత్ యూనియన్ కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. కేకే5,వర్కుషాపు, ఆర్కేఓసీ, కేకేఓసీ, కాసిపేట1,2, శాంతిఖని, సీఎస్‌పీలలో నాయకులు జెండాలను ఆవిష్కరించి జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్‌కట్ చేసి కార్మికులకు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు వీరారెడ్డి, వెంకటరమణ, ఇప్ప సమ్మయ్య, కొండాల్‌రావు, యుగేందర్, రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

బెల్లంపల్లి: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఆవిర్భావ వేడుకలను సోమవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిలో ఘనంగా నిర్వహించారు. సంఘంజెండాను ఆవిష్కరించారు. కార్మికుల పక్షాన టీబీజీకేఎస్ పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో పిట్ సెక్రెటరీ ఉదయ్‌కిరణ్, నాయకులు నూనేటి సత్యనారాయణ, సిరిశెట్టి సత్యనారాయణ, కుమారస్వామి పాల్గొన్నారు.

రెబ్బెన: రెబ్బెన మండలం గోలేటి టౌన్‌షిప్‌లో సోమవారం టీబీజీకెఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. టీబీజీకెఎస్ సెంట్రల్ కమిటీ నాయకుడు వెంకటేష్ టీబీజీకెఎస్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీబీజీకెఎస్ నాయకులు మహేందర్, కార్మికులు పాల్గొన్నారు.

ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది కమిటీ

శ్రీరాంపూర్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది శ్రీరాంపూర్ ఏరియా కమిటీని సోమవారం నియమించారు. ఐఎన్‌టీయూసీ యూనియన్ కార్యాలయంలో బ్రాంచ్‌ఇన్‌చార్జి భీమ్ రవి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర కనీసవేతనాల సలహా మండలి చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ బి జనక్ ప్రసాద్, ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారిసమక్షంలో సింగరేణి కోల్‌మైన్స్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ లేబర్ యూనియన్(ఐఎన్‌టీయూసీ) శ్రీరాంపూర్ ఏరియాకమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిరిపురం రాజేష్, ప్రధానకార్యదర్శిగా ఆవులరమేష్, ఉపాధ్యక్షులుగా దాడి రాజేష్, జాదవ్‌భరత్‌కుమార్, పున్నంనాయక్, ఆడెపు అశోక్, సంయుక్తప్రధాన కార్యదర్శులుగా పెద్ది ఓదెలు, బొద్దుల నరేష్, సహాయ కార్యదర్శులుగా కుమారస్వామి, తదితరులను ఎన్నుకున్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

జన్నారం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని గొల్కొండ పోచమల్లుకు చెందిన రేకుల ఇల్లు సోమవారం షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను ఆర్పి వేశారు. పిల్లల స్టడీ సర్టిఫికెట్లు, కర్ర వస్తువులు, 2తులాల బంగారం, లక్ష రూపాయల నగదు, 4క్వింటాళ్లబియ్యం, ఎలక్ట్రానిక్ వస్తువులు కాలిపోయినట్లు బాధితుడు తెలిపాడు. సుమారు రూ.6లక్షల ఆస్తినష్టం జరిగిందని, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు కోరాడు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి, ఆర్ఐ భానుచందర్, పంచాయతీ కార్యదర్శి లావణ్య సందర్శించి పంచనామా నిర్వహించారు. ప్రభుత్వ నుంచి తక్షన సహాయం అందేలాచూస్తామని తహసీల్దార్ బాధితులకు తెలిపారు. అలాగే పోచమల్లు కుటుంబాన్ని రాష్ట్ర జీసీసీ చైర్మన్ కోట్నాక తిరుపతి పరామర్శించారు. తక్షణ సహాయంగా రూ.15వేలను అందజేశారు. ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఈ ఘటనపై మంత్రి సీతక్కతో మాట్లాడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు.

అక్రమ కలప పట్టివేత



పట్టుకున్న కలపతో అధికారులు

జన్నారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జన్నారం డివిజన్‌లోని తాళ్లపేట రేంజ్‌లో గల లింగాపూర్ గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన కలపను పట్టుకున్నట్లు ఎఫ్ఆర్‌వో సుష్మారావు తెలిపారు. పక్కా సమాచారం మేరకు బుచ్చన్న అనేవ్యక్తి ఇంటిపై దాడిచేసి స్వాధీన పర్చుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలని నిరసన

బెల్లంపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కన్నాల బస్తీలో నివాసం ఉంటున్న ప్రజలకు సింగరేణి సంస్థ విద్యుత్ కనెక్షన్‌లు ఇచ్చి సమస్య పరిష్కరించాలని కోరుతూ సోమవారం విద్యుత్ విభాగం కార్యాలయం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం కొన్నిరోజుల క్రితం తొలగించిన విద్యుత్ కనెక్షన్‌లను తిరిగి యధావిధిగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఇతరవార్డుల్లో తొలగించిన విద్యుత్ కనెక్షన్‌లను పునరుద్ధరించారని కన్నాల బస్తీలో విద్యుత్ కనెక్షన్‌లు పునరుద్ధరించకపోవడంతో బస్తీ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంబంధి త అధికారులు వెంటనే విద్యుత్ కనెక్షన్‌లు అందించి సమస్యపరిష్క రించకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో బస్తీ ప్రజలు పాల్గొన్నారు.

మోసం చేసిన కేసులో..

ప్రభుత్వ ఉపాధ్యాయుడి సస్పెన్షన్

జన్నారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అతనొక ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ప్రతి నెలా ప్రభుత్వం ఇచ్చే జీతంతో సంతృప్తి చెందక అదనపు ఆదాయం కోసం అడ్డదారులు తొక్కాడు. చిన్న పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయంటూ కొందరిని మోసం చేశాడు. చివరికి కటకటాలపాలై సస్పెండ్ అయ్యాడు. జన్నారం మండలంలోని కిష్టాపూర్ ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసే జాడిమురళిని సోమవారం మంచిర్యాల డీఈవో యాదయ్య సస్పెండ్ చేశారు. జాడి మురళి అధిక లాభాలు వస్తాయని ఆశ చూపి తన్విత ఆయుర్వేదిక స్కీంలు పలువురిని చేర్పించి మోసం చేశాడు. ఇందులో భాగంగానే మండలంలోని కలమడుగు హైస్కూల్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మామిడి నర్సయ్యతో రూ. 24 లక్షలు పెట్టుబడి పెట్టించాడు. ఎలాంటి లాభాలు రాక పోగా డబ్బులు తిరిగి ఇవ్వలేదు. దీంతో మోసపోయినట్లు గ్రహించిన నర్సయ్య డిసెంబరు 14న జన్నారం పోలీస్‌స్టేషన్‌లో మురళిపై ఫిర్యాదు చేశాడు. విచారణ జరిపిన పోలీసులు ఈ నెల 24న మురళిని లక్సెట్టిపేట సీఐ నరేందర్, జన్నారం ఎస్ఐలు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. అనంతరం న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. మోసం చేసి జైల్లో ఉన్నందుకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న నివేదిక ఆధారంగా సస్పెం డ్ చేసినట్లు డీఈవో తెలిపారు.

పురుగులు మందు తాగి ఒకరి ఆత్మహత్య

దహెగాం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన టాకిరే పోశాలు(70) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఉత్తం తెలిపారు. పోశాలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్థాపంతో పురుగులు మందుతాగి ఆత్మహత్యాయత్నం పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే పోశాలును కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు ముత్తేశ్వర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

దహెగాం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాళ్లగూడ గ్రామానికి చెందిన బాలిక(13) ఆదివారం అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు హెడ్‌కానిస్టేబుల్ ఉత్తం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బాత్‌రూంకు వెళ్తానని చెప్పి బయటకు వెళ్లిన బాలిక తిరిగి రాలేదు. చుట్టు పక్కల వెతికినా కనిపించలేదు. ఈమేరకు బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

చెన్నూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్లక్కపేటలోని ఆదిశంకరాచార్యుల జిన్నింగు మిల్లులో సోమవారం ప్రమాదవశాత్తు అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మిల్లు ఆవరణలో నిల్వ ఉంచిన పత్తి కుప్పల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గమనించిన సిబ్బంది వెంటనే చెన్నూరులోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో మరో ఫైరింజన్ తెప్పించి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ప్రమాదంపై మార్కెట్ కమిటీ కార్యదర్శి రామాంజనేయులును వివరణ కోరగా మంటలు ఎలా అంటుకున్నాయో సీసీ కెమెరాల్లో పరిశీలిస్తున్నామన్నారు. పత్తి ఎంతవరకు కాలిపోయింది, ఎంత నష్టం జరిగిందో అంచనా వేసి తెలియజేస్తామని పేర్కొన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న..

వ్యక్తిపై కేసు నమోదు

వేమనపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వేమనపల్లిలో గంజాయి మొక్కలు పెంచుతున్న తెల్గ నారాయణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నారాయణ ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు పెంచుతున్నాడనే సమాచారం మేరకు అతడి ఇంటికి వెళ్లి తనిఖీ చేయగా పెరట్లో గంజాయి మొక్కలు లభించాయి. నారాయణను విచారించగా తనకు గంజాయి అలవాటు ఉందని, గంజాయి కొనే స్థోమత లేకపోవడంతో ఓ గుర్తు తెలియని వ్యక్తి వద్ద విత్తనాలు తీసుకుని పెరట్లో నాటినట్లు తెలిపాడు. మండల వ్యవసాయధికారి వీరన్న మొక్కలను పరిశీలించి గంజాయి మొక్కలుగా నిర్ధారించారు. పెరుగుతున్న గంజాయిమొక్క విలువ రూ.10వేలు ఉంటుందని, ఎండిన గంజాయి మొక్క 584గ్రాములు ఉందని, దీని విలువ రూ.14,600ఉంటుందని పేర్కొన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో ఆర్ఐ అబ్దుల్లాఖాలిక్, పోలీసులు పాల్గొన్నారు.

ఎన్టీపీసీ విస్తరణతో ముప్పే..

(5వ పేజీ తరువాయి)

ఇది 200 నుంచి 360కు చేరే ప్రమాదం ఉందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. ఈ కారణంగా కాలుష్యం రామగుండం తోపాటు మంచిర్యాల, నస్పూర్ మున్సిపాలిటీలపై తీవ్ర ప్రభావం చూపనుంది. కాలుష్యం ఈ మేరకు ఏక్యూఐ ఆ మేరకు పెరిగితే క్యాన్సర్, గుండెపోట్లకు దారితీస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వయోవృద్ధులు శ్వాసకోశ వ్యాధుల బారిన పడే ప్రమాదముందని చెబుతున్నారు. కాలుష్యం నుంచి రక్షణ పొందాలంటే నిత్యం తప్పనిసరిగా మాస్కులు ధరించాల్సి వస్తుందని చెబుతున్నారు.

● ప్రజలు వ్యతిరేకించాలి

స్వచ్ఛంద పౌరసేవా సంస్థ

ఎన్టీపీసీలో కొత్త యూనిట్ కోసం మంగళవారం ఏర్పాటు చేయనున్న ప్రజాభిప్రాయ సేకరణను ప్రజలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఈ నెల 23న జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సంస్థ సభ్యులు, పలువురు పర్యావరణ వేత్తలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వాతావరణ కాలుష్యం పెరగడం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ నిరసన తెలియజేశారు.

● సుప్రీం కోర్టు ఆదేశాలు అమలెక్కడ..



ఉమామహేశ్వరరావు, పర్యావరణ వేత్త

గాలిలో నాణ్యత మెరుగుపరచడం కోసం ఎఫ్‌జీ డీ (ఫ్లూ గ్యాస్ డి సల్ఫరైజేషన్) యూనిట్లు నిర్మించాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. అయితే ఆ ఆదేశాలు ఎక్కడా కూడా అమలు కావడం లేదు. ఏక్యూఐలో తప్పుడు సంఖ్యలు చూపిస్తున్నారు. ఇప్పటికైనా పారిశ్రామిక ప్రాంతాల్లో వాయు కాలుష్యాన్ని నియంత్రించడం ద్వారా ప్రజారోగ్యానికి పెద్దపీట వేయాలి.

నిందితుడిని అరెస్టు చేయాలి

దండేపల్లి, జనవరి, 27(ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం రంగపేట గ్రామానికి చెందిన ఆవునూరి రాజయ్య అనే దళిత రైతుపై దాడి చేసిన చందారం గ్రామానికి చెందిన మిల్కూరి మల్లేష్‌ను తక్షణమే అరెస్టు చేసి రిమాండుకు తరలించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కొకన్వీనర్ కల్లూరి రవికుమార్ డిమాండ్ చేసారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిందితుడు మల్లేష్‌తో రాజయ్యకు తన కుటుంబ్యులకు ప్రాణహని ఉందన్నారు. ఈప్రెస్‌మీట్‌లో సంఘం మండల అధ్యక్షుడు జిల్లపెల్లి రాజశేఖర్, కార్యదర్శి సాయికుమార్‌నేత, ఉపాధ్యక్షుడు రాజేష్ ఉన్నారు.

విద్యుత్ అధికారుల భూమి పూజ

చెన్నూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 132కేవీ సబ్ స్టేషన్ ఆవరణలో 31.5 ఎంవీఏటీటీఆర్ ప్లాంట్ నిర్మాణం కోసం సోమవారం విద్యుత్ శాఖ అధికారులు భూమి పూజ చేశారు. 132 కేవీ సబ్ స్టేషన్‌కు అడిషనల్‌గా 31.5 ఎంవీఏటీటీఆర్‌ప్లింట్‌ను ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్ఈ గంగాధర్ పేర్కొన్నారు. డీఈలు ఎంఎం కాసిర్, రాజన్న, ఈఈ సివిల్ సుభాష్, ఏడీఈలు బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, ఏఈలు శ్రీనివాస్, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

మీకు మేమున్నాం..

● మహిళలకు అండగా షీటీం ● ఏడాది కాలంలో 47 ఫిర్యాదులు



పాఠశాలలోఅవగాహన సదస్సు నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)



ఈవ్ టీజర్లకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు (ఫైల్)

మంచిర్యాల క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : రోజు రోజుకూ మహిళలు, విద్యార్థినులపై ఈవ్‌టీజింగ్‌లు, అకృత్యాలు పెరిగిపోతున్న క్రమంలో మేమున్నాం మీకు అండగా అంటూ భరోసానిస్తోంది. లైంగిక వేధింపులకు గురైనప్పటికి వారు ఎవరికి చెప్పాలో అర్థం కాని స్థితిలో ఉండేవారు. కానీ ప్రస్తుతం షీటీం వల్ల పని చేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు గురయ్యే వారు, పాఠశాలల్లో చదువుకునేవారు ఈవ్‌టీజింగ్‌కు గురైన వారికి షీటీం సభ్యులు ధైర్యాన్ని స్తున్నారు. బాధితులకు అండగా నిలుస్తూ వారి మానసిక పరిస్థితి, విద్య పరిస్థితులను గురించి ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకుంటూ వారికి భద్రత కల్పిస్తున్నాయి. భరోసా సెంటర్లో లీగల్ అడ్వైజర్ కౌన్సిలర్, మెడికల్ ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ లైంగిక వేధింపులకు గురైన వారికి సంబంధించిన కేసు పోలీస్‌స్టేషన్‌లో నమోదు అయిన సమయం నుంచి బాధి తులకు అండగా ఉంటున్నారు. మహిళా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల్లో ఫ్యామిలీ కౌన్సిలింగ్‌కు వచ్చే కేసుల్లో దంపతుల మధ్య గొడవలు, సమస్యలతో విడిపోవడం వల్ల జరిగే అనర్థాలను వివరి స్తున్నారు. సర్దుకుపోతేనే సంసారం సాఫీగా సాగుతుం దని నచ్చచెప్పే ప్రయత్నం చేస్తున్నారు. చిన్న సమస్యలకే తొందరపడి విడిపోవద్దని వారికి కౌన్సిలింగ్ నిర్వహిం చి పరి ష్కార దిశగా ప్రయత్నిస్తున్నారు. దీని కోసం మహిళా పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా సెంటర్లు ఏర్పాటు చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారు.

జిల్లా పరిధిలో హాట్‌స్పాట్‌ల సంఖ్య..

ముఖ్యంగా మంచిర్యాల జిల్లా పరిధిలో మొత్తం 1247 హాట్‌స్పాట్‌లను షీటీంలు గుర్తించాయి. షీటీం బృందాలు సందర్శించి జరిగే నేరాలపై మహిళలను, విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్నాయి. ఇప్పటికి జిల్లా కేంద్రంలో సంవత్సర కాలంలో 316 అవగాహన సదస్సులను నిర్వహించారు. ముఖ్యంగా షీటీంలో ఐదుగురు సభ్యులు ఉంటారు. ఇందులో ఒక ఎస్సైతో పాటు

మహిళలకు అండగా ఉంటా...

- ఎస్సై హైమా



మహిళలకు అండగా ఉండడమే షీటీం ఉద్దేశం. సమస్యలు ఎదురైనప్పుడు భయపడ కుండా డయల్ 100కు గాని, సంబంధిత నంబర్లకు ఫోన్ చేస్తే తక్షణమే స్పందిస్తాం. కాలేజీల్లో, పని ప్రదేశాల్లో మహిళలు ఇ బ్బందులకు గురవుతుంటారు. పోలీసులకు చెబితే ఏం అవుతుందో అని సందేహిస్తుంటారు. భయపడాల్సిన పని లేదు. ధైర్యంగా సమాచారం అందించండి. మీకు మేం అండగా ఉంటాం. కేసు తీవ్రతను బట్టి కేసులు నమో దు చేస్తాం. కేసులను బట్టి కౌన్సిలింగ్‌తో పాటు జైలుకు కూడా పంపుతాం.

ఇద్దరు మహిళా పోలీసులు, కానిస్టేబుల్స్ ఉంటా రు. పాఠశాల, కళాశాలల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రైవేటు కార్యాలయాల్లో పని చేస్తున్నప్పుడు సమస్య ఎదురైనప్పుడు తమకు సమా చారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామంటూ వారికి తక్షణ న్యాయం చేస్తామంటూ భరోసా కల్పించేలా అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. పండగ సంద ర్భాల్లో మందిరాలు, ఆలయాల వద్ద కూడా మఫ్టీలో విధులు నిర్వహిస్తూ ఈవ్‌టీజర్లపై చర్యలు తీసుకుం టున్నారు. ప్రేమ పేరుతో వేధించినా, వారి వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు తీసినా, వారిని ఇబ్బందికి గురి చేసినా అది నేరమే. అలాంటి వారిని గుర్తించి ఇప్పటికే పలు కేసులను నమోదు చేశారు. గత సంవత్సరం జిల్లా పరిధిలో 45 ఫిర్యాదులు వచ్చాయి. ఆరుగురిపై కేసులు నమోదు చేశారు. షీటీంకు సమాచారం అందడంతో ఏడు కేసులలో రెడ్ హ్యాండెడ్‌గా 18 మందిని పట్టుకొని వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. 8 మంది మైనర్లకు తల్లిదం డ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిం చారు. ఏడుగురు మేజ ర్లపై ఈ పెట్టి కేసులతో పాటు మరో ముగ్గురిపై కేసులు నమోదు చేశారు. మహిళ లకు, విద్యార్థినులకు సమ స్యలు ఎదురైనప్పుడు వాట్సప్ నంబర్ 8712659385 లేదా 6303923700 నంబర్లకు సమా చారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతూ వే ధించిన వారిపై చట్టపర చర్యలు తీసుకుంటామని పో లీసులు భరోసా కల్పిస్తున్నారు. ఎవరు కూడా భయ పడవద్దని సూచిస్తున్నారు.

మున్సిపల్ పాలకవర్గ సభ్యులకు సన్మానం



చైర్మన్‌ను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

గర్మిళ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలోని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు నివాసంలో మంచిర్యాల, నస్పూర్, లక్షెట్టిపేట చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్‌సభ్యులను సోమవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఘనంగా సన్మానించారు. వీరి పదవీ కాలం పూర్తి కావడంతో సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌కుమార్, పెంట రాజయ్య, అంకం నరేష్, గాదె సత్యం, సు జాత మల్లేష్, ఆఫీజ్‌బే గంతా జుద్దీన్, శ్వేత రమేష్, సుగుణ హాండే చంద్రశేఖర్‌హండే, జాఫర్, వదూద్ పాల్గొన్నారు.

వృద్ధుడిపై పిచ్చికుక్క దాడి

హాజీపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పిచ్చి కుక్క దాడిలో వృద్ధునికి గాయాలయ్యాయి. నంనూర్ ఆర్‌అండ్ ఆర్ కాలనీకి చెందిన చౌతకారి బానయ్య అనే వృద్ధుడు పింఛన్ కోసం పంచాయతీ కార్యాలయానికి వెళ్తుండగా పిచ్చికుక్క దాడి చేసి కరిచింది. వెంటనే కుటుంబీకులు బానయ్యను హాజీపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

మందమర్రిరూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సారంగపల్లి గ్రామంలోని పాలవాగు ప్రాంతంలో 33 సర్వే నెంబరులో కొంత మంది ప్రభుత్వ భూమి కబ్జా చేశారని గ్రామానికిచెందిన బచ్చలి ప్రవీణ్‌కుమార్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఏసీపీకి దళిత సంఘాల నాయకుల సన్మానం

బెల్లంపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : అత్యుత్తమ, విశిష్ట సేవలకుగాను గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్న ఏసీపీ రవికుమార్‌ను సోమవారం దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం పూల మాలలు వేసి స్వీట్లు తినిపించారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల ఐక్య వేదిక నాయకులు కుంబాల రాజేష్, దుర్గం గోపాల్, రత్నం ఐలయ్య, ఆసాది మధు పాల్గొన్నారు.



ఏసీపీని సన్మానిస్తున్న దళిత సంఘాల నాయకులు



ఫ్లడ్‌లైట్లు పంపిణీ చేస్తున్న సీఐ, ఎస్ఐ

క్రీడాకారులకు ఫ్లడ్‌లైట్స్ అందజేత

తాండూర్, జనవరి 27 (ఆంధ్ర జ్యోతి) : వాలీబాల్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అచ్చలాపూర్ నివాసులు దుద్దిళ్ల విష్ణువర్ధన్ రావు తన సోదరుడు దుద్దిళ్ల వేణు గోపాల్‌రావు జ్ఞాపకార్థం 6 ఫ్లడ్ లైట్లను అందజేశారు.

సోమవారం మాదారం పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో తాండూర్ సీఐ కుమారస్వామి చేతులమీదుగా క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రావును సీఐ అభినందించారు. కార్యక్రమంలో తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్, అభినవ సంతోష్‌కుమార్, యువనాయకులు నవీన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు

హాజీపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపల్లి గ్రామంలో మాజీ ఎంపీటీసీ డేగ బాపు ఆధ్వర్యంలో జరుగుతున్న సామూహిక క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. ఫైనల్‌లో డేగ సాయికృష్ణ జట్టు, నరెడ్ల వరుణ్‌కుమార్ జట్టు తలపడగా డేగసాయికృష్ణ జట్టు విజేతగా, నరెడ్ల వరుణ్‌కుమార్ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ బాల మోహన్ బహుమతులు అందజేశారు. విజేత జట్టుకు రూ. 5 వేలు, షీల్డ్, రన్నర్ జట్టుకు రూ. 3 వేలు, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో నిర్వహకులు రాజేశం, తిరుపతి, శ్రీనివాస్ పాల్గొన్నారు.



విజేత జట్టుకు బహుమతులు అందిస్తున్న నిర్వహకులు



ఆసుపత్రిపనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

ఆసుపత్రి పనుల పరిశీలన

గర్మిళ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల ఐబీ చౌరస్తా వద్ద నూతనంగా నిర్మిస్తున్న మాతా శిశు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను సోమవారం మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు పరిశీలించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అంతే కాకుండా పనుల్లో నాణ్యత పాటించాలని, అధికారులు పను లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

అధికారులు పర్యవేక్షణలో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వీలైనంత త్వరగా పనులు పూర్తి చేసి ఆసుపత్రిని ప్రజలకు అందుబాటులోకి తేవాలన్నారు. ఆయన వెంట నాయకులు, కార్యకర్తలు, అధికారులు ఉన్నారు.

క్రీడా ప్రాంగణం ఏర్పాటు

భీమారం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : భీమారం మండల కేంద్రంలో కొన్ని సంవత్సరాలుగా క్రీడా ప్రాంగణం లేక ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు యువకులు విన్నవించగా ఆయన స్పందించారు. సోమవారం రెవెన్యూ అధికారులు ఆర్ఐ స్రవంతి, సర్వేయర్ నాగరాజులు వచ్చి క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి హద్దులు ఏర్పాటు చేశారు. క్రీడా ప్రాంగణం స్థలం ఏర్పాటుకు కృషి చేసిన ఎమ్మెల్యే వివేక్‌కు, జిల్లా నాయకుడు సత్యనారాయణరెడ్డిలకు యువకులు తిరుపతి, రవి, బానేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు.

మహాసభల పోస్టర్ల విడుదల

గర్మిళ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 29న సిద్దిపేటలో జరిగే తెలంగాణ స్టేట్ కన్‌స్ట్రక్షన్ మజ్దూర్‌సంఘ భవన నిర్మాణ కార్మికుల ద్వితీయ రాష్ట్రమహాసభల పోస్టర్లను సోమవారం సంఘం నాయకులు చున్నంబట్టివాడలోని బీఎంఎస్ కార్యాయలంలో విడుదల చేశారు. భవన నిర్మాణ కార్మికులు పెద్ద సంఖ్యలో సభల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాజు యాదవ్, అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్, శంకర్, శ్రీనివాస్, సందీప్, స్వామి, లక్ష్మీనారాయణ, తాపీమే స్త్రీలు, సెంట్రింగ్, పెయింటర్, ప్లంబర్ కార్మికులు పాల్గొన్నారు.

శివ పార్వతుల కల్యాణం

బెల్లంపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కన్నాల గ్రామంలోని బుగ్గ రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఆలయ చైర్మన్ మాసాడి శ్రీదేవిశ్రీరాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు శివ పార్వతుల కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పట్టణ ప్రజలతో పాటు ఆయా గ్రామాల ప్రజలు కల్యాణాన్ని వీక్షిం చేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

ఎస్ఐ కిరణ్‌కుమార్

తాండూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని తాండూర్ ఎస్ఐ కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం ఐబీ కేంద్రంలో రోడ్డు భద్రతపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహనానికి సంబంధించిన అన్ని ధృవీకరణ పత్రాలు కలిగి ఉండాలన్నారు. మద్యం సేవించి అతి వేగంగా, నెంబరు ప్లేట్ లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దన్నారు.

శనివారం సంత ప్రాంతం నుంచి తాండూర్ బస్టాండ్ వరకు రోడ్డుకు అడ్డంగా వాహనాలు నిలపకుండా దుకాణాల యాజమానులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిభందనలపై అవగాహన


దండేపల్లి: రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా మండలంలోని గుడిరేవు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు ఎస్సై ఉదయ్‌కిరణ్ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మనం మన కుటుంబ సభ్యులకు బైక్‌పై బయటకు వెళ్ళే సమయంలో హెల్మెట్ ధరించాలని అదే విధంగా కారు నడిపే సమయంలో సీట్‌బెల్టు ధరించాలన్నారు. పుస్తకాల్లో ట్రాఫిక్ సూచనలు ఉంటాయని వాటిని తప్పకుండా ఇంట్లో మన పెద్దలకు తెలియ జేసే బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బొలిశెట్టి బుచ్చన్న, ఏఏపీసీ చైర్మన్ స్వరూప, సిబ్బంది శ్రీనివాస్, శ్యామల, అనిత, కందు పాల్గొన్నారు.



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ కిరణ్‌కుమార్

మహా ప్రస్తానం మోడల్‌గా నిలుస్తుంది

ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాల క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మహాప్రస్తాన పనులను 11 కోట్లతో నిర్మాణం చేపట్టినట్లు, దేశానికే మోడల్‌గా నిలుస్తుందని ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. సోమవారం మహా ప్రస్తాన పనులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శివరాత్రి నాడు మహా ప్రస్తానాన్ని ప్రారంభిస్తామన్నారు. మహా ప్రస్తానంలో విద్యుత్‌ను వాడకుండా సోలార్ సిస్టంను ఏర్పాటు చేశామన్నారు. ప్రజలను బీఆర్ఎస్ విస్మరించింది కాబట్టే ప్రజలు కూడా బీఆర్ఎస్‌ను విస్మరించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్ల సత్యనారాయణ, నరేష్, మాజీ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

రగ్బీ ఎంపిక పోటీలు

నస్పూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-15 బాల బాలికల ఎంపిక పోటీలు సోమవారం నస్పూర్‌లోని కేజీఏ డిఫెన్స్ అకాడమీ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఎంపికైనా క్రీడాకారులకు మళ్లీ క్యాంపు ఏర్పాటు చేసి అందులో ప్రతిభ కనబరిచిన వారిని జిల్లా నుంచి ఎంపిక చేయనున్నట్లు నిర్వహకులు తెలిపారు. ఎంపిక పోటీలకు దాదాపు 150 మంది క్రీడాకారులు హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో కేజీఏ డిఫెన్స్ అకాడమీ అధ్యక్షుడు సత్యనారాయణ, జిల్లా ప్రదాన కార్యదర్శి మహేష్, అకాడమీ డైరెక్టర్ కుమార్, కోచ్ రమేష్, పీఈటీలు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు ఉద్యోగుల వినతి

లక్షెట్టిపేట, జనవరి, 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో ఉద్యోగులు పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ తహసీల్దార్ దిలీప్ కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. కేంద్రం ప్రభుత్వం ఎప్రిల్ ఒకటవ తారీకు నుంచి ఏకీకృత పెన్షన్ విధానం అమలు చేస్తుందన్న నేపథ్యంలో ఉద్యోగులను దృషిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం కంట్రిబ్యూటరీ పెన్షన్‌ను కొనసాగించే విధంగా చూడాలన్నారు. పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు తిరుపతి, గౌరవ అధ్యక్షుడు వేణుగోపాల్, రాష్ట్ర అసోసియేషన్ అధ్యక్షుడు తిరుపతి, సత్యనారాయణ ఉన్నారు.

ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించాలి

కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : జిల్లా నుంచి ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ, పరిశ్రమ రంగాలను ప్రోత్సహిస్తూ ఉత్పత్తుల ఎగుమతి శాతాన్ని పెంపొందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. మామిడి, వరిధాన్యం ఎగుమ తులపై అధిక దృష్టి సారించాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద కుల వృత్తులకు చేయూతను అందిస్తున్నారని, ఈ క్రమంలో అర్హుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని, పథకం ప్రజలకు తెలిసేలా ప్రచారం చేయాలన్నారు.

పథకాల అమలు ఘనత సీఎం రేవంత్‌దే

ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి


మంద మర్రి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఆదివారం గణతంత్ర దినోత్సవం సందర్భంగా గ్యారెంటీ పథకాలకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రభుత్వంపై పదే పదే విమర్శలు చేసిన ప్రతి పక్ష బీఆర్ఎస్, బీజేపీలకు తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు.

జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక

జైపూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు ఖమ్మంలో జరిగిన రాష్ట్రస్థాయి బాలికల (అండర్ 17) క్రికెట్ పోటీల్లో జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని సంజన ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు నాగోతు శ్యాంసుందర్, పీడీ సిరంగి గోపాల్ సోమవారం తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు హర్యాణాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటుందన్నారు.

విద్యార్థుల భవిష్యత్ దేశానికి బలం

దండేపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవిష్యత్తే దేశానికి బలమని సోషియల్ జస్టిస్ ఫర్ వర్ల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ రాష్ట్ర వర్కింగ్ కమిటీ చైర్మన్ కారుకూరి మధుకర్ అన్నారు. దండేపల్లి మండలం ముత్యంపేటలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం పేద విద్యార్థులందరికి ఎస్‌జెడబ్ల్యూ ఆర్‌సీ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, నోట్ బుక్స్ అందజేశారు. సంస్థ జాతీయ చైర్మన్ కోప్పుల విజయ్‌కుమార్ ఆదేశాల మేరకు సామాజిక సేవలో ముందుంటామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచు విఠల్, మాజీ ఉప సర్పంచు వెంకటేష్, సంస్థ జిల్లా అధ్యక్షకార్యదర్శు వెంకటేష్, చెన్న కిరణ్‌కుమార్, రాజేష్, ప్రధానోపాధ్యాయుడు మల్లయ్య, ఉపాధ్యాయురాలు వందన, పాల్గొన్నారు.



బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలి



ప్రదర్శనలు చేస్తున్న విద్యార్థులు

బెల్లంపల్లి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చదువుకునే వయస్సులో విద్యార్థులు బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఓరియంట్ సిమెంట్ కంపెనీ చీఫ్ జీఎం ఆనంద్ కులకర్ణి అన్నారు. ఆదివారం రాత్రి పట్టణంలోని రాంజీగోండు విద్యార్థి నిలయంలో 17వ వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చదువుకునే వయస్సులో కష్టపడి చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన పలు సంస్కృతిక కార్యక్ర మాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో తాటిపెల్లి సత్యనారాయణ, కొలిపాక విద్యాసాగర్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ట్రైనీ ఎస్సైలు



శిక్షణ పొందిన ఎస్సైల బృందం

నస్పూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : 20మంది ట్రైనీ ఎస్సైలు శిక్షణలో భాగంగా సీసీసీ నస్పూర్ పోలీస్‌స్టేషన్‌ను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఎస్సైలకు స్టేషన్‌లో రికార్డుల మెంటనెన్స్ వర్టికల్స్, రిసెప్షన్, అడ్మిన్‌వర్టికల్స్, రైటర్ వర్టికల్స్, ఎస్‌హెచ్‌వో వర్టికల్స్, పోలీసుల వీదుల గురించి అవగాహన కల్పించారు. క్రమశిక్షణ ఎంతో అవసరమని నస్పూర్ ఎస్సై నెల్కి సుగుణాకర్ సూచించారు.

ఎన్టీపీసీ విస్తరణతో ముప్పే..!



మంచిర్యాలలో నిరసన తెలియజేస్తున్న స్వచ్ఛందసార సేవాసంస్థ సభ్యులు (ఫైల్)

- మూడు యూనిట్ల విస్తరణకు సన్నాహాలు
- నేడు ప్రజాభిప్రాయ సేకరణ
- మంచిర్యాల జిల్లాకూ పొంచి ఉన్న కాలుష్య ప్రమాదం
- ఇప్పటికే కాలుష్యం భారిన జిల్లా ప్రజలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పర్యావరణ వేత్తలు

మంచిర్యాల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో నూతనంగా ఏర్పాటు చేయనున్న 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా జిల్లా ప్రజలపై కాలుష్య పిడుగు పడనున్నది. ఇప్పటికే సింగరేణి గనులు, ఓసీపీలు, ఎన్టీపీసీ, ఎస్టీపీపీలు, తదితర పరిశ్రమలతో మంచిర్యాల పట్టణం, పరిసర ప్రాంతాలు కాలుష్యపు కోరల్లో చిక్కుకున్నాయి. ఈ క్రమంలో 4 వేల మెగ మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని రామగుండం ఎన్టీపీసీలో ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. 4000 మెగావాట్ల ఉత్పత్తి సార్థ్యంగల ఐదు సూపర్ థర్మల్ యూనిట్ల ఏర్పాటుకు ఎన్టీపీసీ సిద్ధమైంది. ఇందులో 800/2 1200 మెగావాట్ల విద్యుత్ కేంద్రాలు ఇప్పటికే ప్రారంభం కాగా మరో 800/3 యూనిట్ల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ. 29,345 కోట్లు మంజూరు చేసింది. ఈ యూనిట్ల నిర్మాణ అనుమ తుల నేపథ్యంలో పర్యావరణ అనుమతి కోసం ప్రజా భిప్రాయాన్ని ఈ నెల 28న ఎన్టీపీసీలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేశారు. కాలుష్య నియంత్ర ణ మండలి ఆధ్వర్యంలో కలెక్టర్ సమక్షంలో ప్రజా భిప్రాయ సేకరణ జరుగనున్నది. ఈ మూడు యూ నిట్లు ప్రారంభమైతే ఈ ప్రాంతంలో వాతావరణ కాలుష్యం పెరిగి మనుగడే ప్రశ్నార్థకం చేసే స్థాయికి చేరుకుంటుందనే ఆందోళన జిల్లా ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

బొగ్గును మండించడం ద్వారా....

ఎన్టీపీసీలో పాత 2400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి రోజూ 40వేల టన్నుల బొగ్గు మండిస్తున్నారు. కొత్తగా ఏర్పాటు చేయదలచిన తెలంగాణ సూపర్ థర్మల్ 4వేల మెగావాట్ల సామర్థ్యానికి రోజూ 60వేల టన్నుల బొగ్గును మండించాల్సి ఉంటుంది. అంటే మొత్తంగా రోజుకు లక్ష టన్నుల బొగ్గును మండించాల్సి వస్తుంది. ఒక టన్ను బొగ్గును మండించడం గాలిలో సూక్ష్మ దుమ్ము, ధూళికణాలు పీఎం (పర్టిక్యులేట్ మ్యాటర్) మూడుకిలోలు వెలువడుతాయి. అది గాలిలో చేరడం వల్ల ఆక్సిజన్ బరువుతో వెయ్యి కిలోలు దాటి దుమ్ము, దూళికణాలు వాతావరణంలోకి ప్రవేశిస్తాయి. అదే టన్ను బొగ్గు కాల్చడంవల్ల కార్బన్‌డై ఆక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ వాతావరణంలో కలిసిపోతాయి. ఇవి ఈ ప్రాంత భూతాపాన్ని పెంచడంతో పాటు దీర్ఘకాలిక వాతావరణ ప్రతికూల పరిస్థితులను పెంపొందిస్తాయి. ఒక టన్ను బొగ్గు మండించడంతో సల్ఫర్ మోనాక్సైడ్ కూడా 4కిలోలు వెలువడుతుంది. దీనివల్ల ఊపిరితిత్తుల వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంది. ఎన్టీపీసీ చెబుతున్న లెక్కల ప్రకారమే బొగ్గు మండించడం వల్ల బొగ్గు నాణ్యతను బట్టి 40శాతం వరకు బూడిద బయటకు వస్తుంది. టన్ను బొగ్గుకు 400 కిలోల బూడిద బయటకు వస్తుంది. యేటా 36.5 మిలి టన్నుల బొగ్గును విద్యుత్ ఉతత్తికి వినియోగిస్తే వాతావరణ కాలుష్యం పెరిగే అవకాశం ఉంది.

ఉపాధి, ఉద్యోగాలంటూ....

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఎన్టీపీసీ విడుదల చేసిన నివేదికలో 800/3 మెగావాట్ల విద్యుత్ కేంద్రాల ఏర్పాటు ద్వారా 80 శాశ్వత ఉద్యోగాలు, 216 కాంట్రాక్టు ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించింది. అయితే ప్లాంట్ల నిర్మాణ సందర్భంలో మాత్రం రెండేళ్ల పాటు 3 వేల మందికి ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొంది. భారీ విద్యుత్ ప్లాంట్‌లో ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి, ఉద్యోగాల ప్రయోజనాలు కూడా కలుగడం లేదనే అభిప్రాయాలు ఉన్నాయి. ఎన్టీపీసీలో ప్రస్తుతం నార్త్ ఇండియాకు చెందిన వారే అధికంగా ఉన్నారని, ఈ ప్రాంత వాసులకు ఉద్యోగాలు లభించిన దాఖలాలు పెద్దగా లేవనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

డబ్ల్యూహెచ్‌వో చెబుతున్నది ఏమిటి...

ప్రపంచ ఆరోగ్య సంస్థ గాలిలో 15 మైక్రో గ్రాముల ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (ఏక్యూఐ) ఉండాలని చెబుతోంది. పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి నిబంధన ప్రకారం 50 మైక్రో గ్రాములు ఉండవచ్చు. రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఇప్పటికే 110 మైక్రో గ్రాముల ఏక్యూఐ ఉందని..

(తరువాయి 7వ పేజీలో)



జోరుగా యాసంగి నాట్లు

- రెబ్బెన మండలంలో 2500 ఎకరాల్లో వరి సాగు
- కూలీలకు చేతి నిండా పని

6



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

మీకు మేమున్నాం..

- మహిళలకు అండగా షీటీం
- ఏడాది కాలంలో 47 ఫిర్యాదులు

7

సీసీఐ అధికారులు సకాలంలో డబ్బులు చెల్లించాలి

● కాంగ్రెస్ నాయకులు

చెన్నూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సీసీఐకి పత్తి విక్రయించిన రైతులకు సంబంధించి శాఖ అధికారులు సకాలంలో డబ్బులు చెల్లించాలని కోటపల్లి మాజీ జడ్పీటీసీ పోటు రాంరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం చెన్నూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు సీసీఐకి పత్తిని విక్రయించినప్ప టికీ వారి బ్యాంకు ఖాతాల్లో అధికారులు డబ్బులు జమ చేయడంలో అలసత్వం వహిస్తున్నారని ఆరోపించారు. నెలల తరబడి డబ్బులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కాకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అలాగే పత్తిని విక్రయించే సమయంలో రైతుల బ్యాంకు ఖాతాల్లోనే డబ్బులు పడేలా చూడాలన్నారు. కొంత మంది రైతులకు సేవింగ్స్ ఎకౌంట్‌లతో పాటు క్రాప్ లోన్ అకౌంట్‌లు ఉన్నాయన్నారు. దీంతో క్రాప్ లోన్ ఎకౌంట్లలో డబ్బులు జమ అయితే వాటిని విత్‌డ్రా చేయడంలో ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని పేర్కొన్నారు. మార్కెట్ కమిటీ అధికారులు ఈ విషయం పై రైతులకు అవగాహన కల్పించాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందించి పత్తి విక్రయించిన రైతులకు సకాలంలో డబ్బులు ఖాతాల్లో పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీటీసీ బాపు, మాజీ సర్పంచు సంజీవరెడ్డి, పోశం, శ్రీనివాసరెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఆదిపరాశక్తి ఆలయంలో డీసీసీ అధ్యక్షురాలు పూజలు

నస్పూర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నస్పూర్ 21వ వార్డులోని అదిపరాశక్తి ఆలయంలో సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్‌సాగర్ రావు అమ్మవారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం, పట్టు వస్త్రాలను సమర్పించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవారిని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో 21వ వార్డు ఇన్‌చార్జి, సహకార సంఘం డైరెక్టర్ ధరణి మధుకర్, వార్డు అధ్యక్షుడు గోపతి తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు రెంక తిరుమల, మాజీ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రిటైర్డ్‌మెంట్ కార్మికులు, వార్డు ప్రజల పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

● డిప్యూటీ తహసీల్దార్‌కు పీఆర్టీయూటీఎస్ వినతి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ టీఎస్ సభ్యులు

దండేపల్లి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం పాత పెన్షన్ విధాన్నాన అమలు చేయాలని దండేపల్లి మండల పీఆర్టీయూటీఎస్ డిమాండ్ చేసింది. సోమవారం దండేపల్లిలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సంఘం బాధ్యులు డిప్యూటీ తహసీల్దార్ విజయకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మండలశాఖ అధ్యక్ష కార్య దర్శులు రవనవేని రవి, మల్యాల మల్లేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభు త్వం సీపీఎస్‌కు బదులుగా ప్రవేశపెట్టిన యునైటెడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) గెజిట్ విడుదల చేసిందన్నారు. దీనిని తాము వ్యతిరే కిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా ఓల్డ్ పెన్షన్ స్కీ మ్ ఏపీఎస్ ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు కోండు జనార్ధన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అప్పాల మనోహర్, జిల్లాబాధ్యులు విజయ్‌చందు, శ్రీనివాస్, యాగండ్ల గంగ న్న, ఆవుల నరసింహులు పాల్గొన్నారు.

చుక్కల దుప్పిని చంపిన కేసులో కోర్టులో నిందితుల హాజరు..

చెన్నూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : చుక్కల దుప్పిని హతమార్చిన కేసులో ఇద్దర్ని కోర్టులో హాజరు పర్చినట్లు ఎఫ్ఆర్‌వో శివకుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని శివలింగాపూర్ గ్రామానికి చెందిన బోయప్రసాద్, నక్క మహేందర్, ఊరటి పోచం అనే ముగ్గురు వ్యక్తులు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో అడవి జంతువుల కోసం విద్యుత్ తీగలు అమర్చి చుక్కల దుప్పిని హతమార్చారు. ఈ నెల 24న రాత్రి సమయంలో నక్క మహేందర్ ఇంట్లో కోసి పోగులు వేస్తున్నారు. పక్కా సమాచారం మేరకు దాడి నిర్వహించి ప్రసాద్, మహేందర్‌లను పట్టుకున్నారు. మరో వ్యక్తి పోచం పారిపోయినట్లు తెలిపారు. పట్టుకున్న ఇద్దర్ని సోమవారం మంచిర్యాల కోర్టులో హాజరు పర్చినట్లు ఆయన పేర్కొన్నారు. నిందితులను పట్టుకున్న వారిలో డిప్యూటి రేంజ్ అధికారి ప్రభాకర్, బీట్ అధికారి స్వప్న, సెక్షన్ అధికారులు రాజేష్, చంద్రమోహన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత

● బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్



మాట్లాడుతున్న ఏసీపీ రవికుమార్

మందమర్రిటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత అని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటిస్తే ఎలాంటి ప్రమాదాలు జరగవని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. సోమవారం పట్టణంలోని సీఆర్‌క్లబ్‌లో రోడ్డుభద్రత మాసోత్సవాల్లో భాగాంగా ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు, ప్రైవేటు వాహనదారులకు నిర్వహించిన ట్రాఫిక్ నిబంధనల సదస్సుకు హాజరై మాట్లాడారు. ఈ మధ్య కాలంలో చాలా మంది వాహనాలు నడుపుతూ నిబంధనలు పాటించకపోవడం వల్లనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ అతి వేగంగా వెళ్తూ ప్రమాదాల భారీన పడుతున్న సంఘటనలు కోకొల్లలని పేర్కొ న్నారు. లక్షలు పెట్టి వాహనాలు కొనుగోలు చేస్తున్నా హెల్మెట్ ధరించకపోవడం వల్లప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. ద్విచక్ర వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలను వెంట ఉంచుకో వాలని, మద్యం సేవించి వాహనాలు నడపవద్దని తెలిపారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, సుదూర ప్రయాణం చేసే డ్రైవర్లు విశ్రాంతి ప్రదేశంలో వాహనాలు ఆపుకొని నిద్రించడం మంచిదని, సమయస్ఫూర్తితో వాహనాలు నడపడంతో ప్రమాదాలు జరగవన్నారు. రాత్రివేళ రోడ్లపై వాహనాలు నిలపవద్ద న్నారు. ప్రతి ఒక్క వాహనదారులు వారిపై వారి కుటుంబాలు ఆధారపడి ఉన్నాయననే విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ప్రతీ ఒక్కరికి నియమ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు సబ్ డివిజన్ పరిధిలో సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాకారులు ప్రమాదాలపై నిర్వ హించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకు న్నాయి. ఈ కార్యక్రమంలో మందమర్రి ఎస్సై రాజశేఖర్, సీఐ శశిధర్‌రెడ్డి, ఏఎస్సై మజీద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి సమస్యలకు తక్షణ పరిష్కారం

● కలెక్టర్ కుమార్ దీపక్



అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతీ దరఖాస్తుకు తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ కుమార్ దీపక్ కింది స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్, ఆర్డీవోలు శ్రీనివాసరావు, హరికృష్ణలతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి తరలి వచ్చిన ప్రజలు దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామన్నారు. అనంతరం రెవెన్యూశాఖ నూతన సంవత్సరం డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో చెన్నూ రు ప్రత్యేక డిప్యూటీ తహసీల్దార్ చంద్రకల, అధికారులు పాల్గొన్నారు.

పదోన్నతుల ద్వారానే పోలీసులకు గుర్తింపు

● పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

మంచిర్యాల క్రైం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు వస్తుందని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. కమిషనరేట్ పరిధిలో 10మంది హెడ్ కానిస్టేబుళ్లకు ఏఎస్ఐలుగా, ఇద్దరు ఎఆర్ హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ఎస్ఐలుగా పదోన్నతి పొందిన అధికారులకు కార్యాలయంలో అభినందించి వారికి పదోన్నతి చిహ్నం అలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పదోన్నతులతోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని, ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘ వేంద్ర రావు, గోదావరిఖని ఎసీపీ రమేష్, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ మల్లేశం, కమిషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు పోచలింగం ఉన్నారు.

లక్ష డప్పులు, వెయ్యి గొంతులకు కదం తొక్కండి

● 3న మందమర్రికి మందకృష్ణ రాక



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య

మందమర్రి టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ రిజర్వేషన్లను ఏబీ సీడీలుగా వర్గీకరించాలని సుప్రిం కోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 7న తలపెట్టిన లక్ష డప్పులు వెయి గొంతుల కార్యక్రమానికి కదం తొక్కాలని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య పేర్కొన్నారు. సోమవారం మంద మర్రి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ ఉమ్మడి రిజర్వేషన్ ఫలాలను ఒక సామాజిక వర్గం వారే లబ్ది పొందుతూ వచ్చారన్నారు. ఈ రిజర్వేషన్లు మాల మాదిగల పంచాయతీ కాదని, 59 ఉప కులాలకు సంబంధించిందని తెలిపారు. సుప్రింకోర్టులో ఆరుగురు న్యాయమూర్తులు తీర్పు ఇచ్చారని, దీనిని మాల సామాజిక వర్గం వారు అడ్డుకో వడం మంచిది కాదని తెలిపారు. ఆరు నూరైనా వర్గీకరణ జరిగి తీరు తుందన్నారు. తమ నాయకుడు మందకృష్ణను విమర్శిస్తే సహించేది లేదన్నారు. మందమర్రికి ఉద్యమనేత మంద కృష్ణ ఫిబ్రవరి 3న హాజరవుతున్నారని, మంద మర్రి నుంచి చెన్నూరు వరకు డప్పులతో దరువు వే స్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి మాదిగ కులాల వారు అందరు కూడా తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం డప్పుతో దరువు వేశారు.

ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, మంచిర్యాల ఇన్‌చార్జి మంతెన సంపత్, జీడి సారంగం, చంద్రశేఖర్, రాజ్‌కుమార్, కుమార్, శంకర్, రాజనర్సు, రాజ నర్సు, సుమన్, కిరణ్ పాల్గొన్నారు.

● మూడు దశాబ్దాలుగా ఏబీసీడీ వర్గీకరణతో పాటు సామాజిక ఉద్య మాలు శాంతియుతంగా నడుపుతున్న మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ అవార్డు ఇవ్వడం మాదిగ జాతికి గర్వకారణం అని మాజీ ఎమ్మెల్యే కాసిపేట లింగయ్య తెలిపారు. త్వరలో అభినందన కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంతెన సంపత్, పాల్గొన్నారు.